

రైతుబజార్లలో మద్దతుధర పొందొచ్చు

రైతులకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సూచన

ప్రజాశక్తి-విజయనగరం

కూరగాయలు పండించే రైతులు తాము పండించే పంటకు మద్దతు ధర రావడం లేదని భావిస్తే తమ సమీపంలోని రైతు బజార్లకు వాటిని తీసుకువచ్చి మద్దతు ధర పొందవచ్చని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు రవికిరణ్ తెలిపారు. రైతులు నేరుగా తమ సరుకును రైతు బజారుకు తీసుకువచ్చినట్లయితే ఆరోజు రైతు బజార్లో ఉన్న ధరకు వాటిని కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. తమ పంటకు మద్దతు ధర రావడంలేదని భావించిన రైతులు తమ మండల ఉద్యాన అధికారులు గానీ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గానీ సంప్రదించాలని కోరారు. రైతు బజార్లలో తమ పంటను విక్రయించదల్చిన రైతులు 9182158074 మొబైల్ నెంబర్ కు ఫోన్ చేసి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

జర్నలిస్టుపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

- కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల నిరసన
- జాయింట్ కలెక్టర్‌కు వినతి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు చేసిన దాడికి నిరసనగా సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టు సంఘాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు శివ ప్రసాద్, ఎం ఎంఎల్ నాయుడు, కోటేశ్వరరావు, సి హెచ్ రాము మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల వార్తలను కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరి రామారావుపై వేణుగోపాల్ నాయుడు దాడి చేయడంతో పాటు చంపుతానని బెదిరించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. దాడి చేసిన వేణుగోపాల్ రాయుడు వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 'ఎన్నికల కోడ్ అధికారులకు పట్టదా?' అనే శీర్షికతో ఈనెల 3వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో వార్త వచ్చిందని , దీనిపై కక్ష పెట్టుకున్న వేణుగోపాల్ నాయుడు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనకు వెళ్లిన విలేకరి రామారావుపై దాడికి దిగాడని అన్నారు. తమపై గాని, తమ నాయకులపైగాని వార్తలు రాస్తే చంపేస్తానని బెదిరించిన వేణుగోపాల్‌నాయుడును తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమాజ శ్రేయస్సు కోసం వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు సరికాదని తెలిపారు. ఇదే పద్ధతి కొనసాగితే మరింత ఉద్యమాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని కోరుతూ జాయింట్ కలెక్టరు సేతు మాధవన్ కు వినతి అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

మెంటాడ : ప్రజాశక్తి మక్కువ విలేకరిపై దాడికి వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జర్నలిస్టులపై దాడులను కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం నాయకులు తామరాపల్లి సోములు, ఐద్వా జిల్లా నాయకులు రాకోటి హరికృష్ణవేణి ఖండించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందించారు.

చీపురుపల్లి : మక్కువ ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన ఆ మండల టిడిపి అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం విలేకరిపై దాడిని వ్యతిరేకిస్తూ నియోజకవర్గం విలేకరులు ర్యాలీ చేశారు. అనంతరం గరివిడి తహశీల్దారు సిహెచ్ బంగార్రాజుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిజాయితీగా పనిచేస్తూ విధులు నిర్వహిస్తున్న విలేకరిపై ఇలాంటి దాడులు మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గణేష్, హరీష్, సత్యనారాయణ, బలగ రామారావు, ఎం.సతీష్, ఆర్ అప్పలనాయుడు, రమేష్, బిబి ఆర్, సంతోష్, ఎం నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి నాయకుడు దాడి చేయడం దుర్మార్గమని వైసిపి ఎస్‌సి సెల్ మాజీ అధికార ప్రతినిధి, టూరిజం మాజీ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమైన పత్రిక వ్యవస్థపై దాడి సమంజసం కాదన్నారు.


గరివిడి తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

దాడిని ఖండించిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి నాయకుడి దాడిని జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమైన పత్రిక వ్యవస్థపై దాడి సమంజసం కాదని అన్నారు. వ్యతిరేక వార్తలు రాసినప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా దానికి వివరణ ఇవ్వాలని, లేదా ప్రకటన ద్వారా ఖండించ చాలి తప్ప, భౌతిక దాడులు సరైన మార్గం కాదని అన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు బాధిత పాత్రికేయులకు అన్ని విధాల అండగా నిలుస్తామని ఆయన తెలిపారు.

శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక పిడిఎఫ్

మాజీ ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శాసనమండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రశ్నించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని మాజీ ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంపై తీవ్ర దాడి జరుగుతోందన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రయివేట్‌ను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వ కళాశాలల్లో కొత్త కోర్సులు, సిబ్బంది నియామకం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థుల డ్రాపౌట్ పెరుగుతున్నాయని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటం ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని గుర్తు చేశారు. రాజకీయ పార్టీల తరుపున గెలిచే వ్యక్తులు శాసనమండలికి పంపితే వారిపై ఆ పార్టీల పెత్తనం ఉండడంతో, వారు సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపిస్తే ఆమె స్వతంత్రంగా వ్యవహరించి సమస్యలపై పోరాడతారని చెప్పారు. ఆయన వెంట జెవివి నాయకులు మురళీధర్, ఉద్యోగ సంఘాల నాయకులు కె.శ్రీనివాసు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి : విజయగౌరి

విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కంచిలి, మందస, టెక్కలి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం 117 జిఒను రద్దు చేస్తామని చెప్పినా, దాని స్థానంలో అలాంటి విధానాలతో మరో జిఒను తీసుకొస్తోందని తెలిపారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రతిఘటించేందుకు, ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచేందుకు తనను గెలిపించాలని కోరారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటం చేస్తానని, కెజిబివిలో సిఆర్‌టిలకు ఎంపిఎస్ విధానం అమలయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. కాంట్రాక్టు అధ్యాపకులకు 114 జిఒ అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే సర్వీస్ రూల్స్ వర్తించేలా చూస్తానని హామీనిచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రభుత్వమే సంక్షేమ నిధిని, బీమాను ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్ టు విధానాన్ని కొనసాగించాలన్నారు. యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, నాయకులు పాల్గొన్నారు.


మందసలో మాట్లాడుతున్న విజయగౌరి

తోటపల్లి కాలువ పనులు అడ్డగింత

ప్రజాశక్తి - పూసపాటిరేగ


కాలువ పనులు అడ్డుకుంటున్న రైతులు

మండలంలోని కందివలస ఊరచెరవు వద్ద తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ విస్తరణ పనులను సోమవారం కందివలస ఆయకట్టు రైతులు అడ్డగించారు .కాలువ కోసం చెరువు మధ్యలో ఎలా తవ్వేస్తారని అధికారులను నిలదీశారు. జెసిబి, టిప్పర్లును వెనక్కి పంపించారు. మండలంలోని కందివలస రెవెన్యూ పరిధిలోని 54ఎకరాల విస్తీర్ణం కలిగిన ఊర చెరువు ఉంది. తోటపల్లి కాలువ కోసం సుమారు 25ఎకరాల మేర చెరువు గర్భంలో నుండి తవ్వేస్తున్నారు. ఈనేపథ్యంలో రైతులంతా మా గ్రామంలో ఉన్న చెరువును తవ్వేసి కాలువ చేస్తామంటే ఊరకోబోమన్నారు. మధ్యలో అడ్డంగా గోడను కట్టేస్తే మా వ్యవసాయం ఎలా సాగు చేసుకోవాలని తోటపల్లి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. 500ఎకరాల ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఊర చెరువును ఆనుకుని మరో ఐదారు చెరువులకు వెళ్ళే సాగు నీటిని ఆధారం చేసుకొని సుమారు 200మంది రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారని అన్నారు. అలాంటి చెరువుకు ఆనవాళ్ళు లేకుండా చేస్తామంటే సహించేది లేదని తేల్చి చెప్పారు. కాలువ పనులు చేస్తున్న జేసీబిని టిప్పర్ అడ్డుకొని వెనుకకు పంపించారు. రైతులను మభ్యపెట్టి అడ్డంగా గోడ కడితే ఊరుకోబోమని , చెరువుకి నీరందేలా పైపులైన్ ఏర్పాటు చేస్తామని అధికారికంగా లెటర్‌పై రాసి ఇస్తేనే ఇక్కడ పనులను యధావిధిగా కొనసాగిస్తామని అన్నారు. 2004లో ప్రాజెక్ట్ అప్రూవల్ అయినప్పుడు చెరువులకు కాకుండా మెట్ట పంటలకు మాత్రమే నీరు అందించాలని ప్రాజెక్టు అప్రూవల్ లో ఉందని ఇంజినీరింగ్ అధికారి సుబ్బారావు చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు ప్రతి ఆయకట్టుకు కూడా నీరు ఇవ్వాలని ప్రతిపాదించిన తరువాత 2011లో ఎస్ఇ అప్రూవల్ చేసిన తరువాత ఎలైన్ మెంట్ తవ్వడం జరిగిందని అధికారులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు అంగీకరించలేదు. చెరువుకు సంబంధించి ఈ కాలువ నీరు చెరువులో కలిసినా , చెరువు నీరు కాలువలో కలిసినా... ఆయకట్టు తగ్గిపోతుందని ఆర్ డిఒ ద్వారా రివైజ్డ్ అప్రూవల్ ఇచ్చి కాలువ పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు కూడా ప్రభుత్వం ల్యాండ్ కిందే వస్తుంది కానీ , ప్రైవేట్ ల్యాండ్ అవ్వదని అన్నారు. కావున పేపర్ మీద ఎలైన్ మెంట్ చేసి కాలువను ఫాం చేశామని తెలిపారు. ఈ విషయమై డిఇ సుచిత్రతో మాట్లాడామని ఇక్కడ కావాలంటే పైపులు వేస్తామని రైతులకు వివరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు అంగీకరించలేదు.

పాల సేకరణ ధర పెంచాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పాలరైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు

విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను పెంచాలని, అవినీతికి పాల్పడిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణ మూర్తి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగింది. సమావేశంలో రాష్ట్ర పాల రైతుల సంఘం అధ్యక్షులు బి.రాంబాబు మాట్లాడుతూ గత నవంబర్‌లో ఆవు పాల సేకరణ ధరను లీటరుకు 3 నుంచి 4రూపాయలు తగ్గించారన్నారు. పాలరైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు దఫాదఫాలుగా ఆందోళన దిగడంతో ప్రభుత్వం స్పందించి విచారణకు హౌస్‌కమిటీ వేసిందన్నారు. దీంతో డెయిరీ చైర్మన్ విచారణ నుంచి తప్పించు కునేందుకే బిజెపిలో చేరారన్నారు. విచారణకు విధించిన గడువు 60 రోజుల ముగిసినా కమిటీ ఇంతవరకు రిపోర్ట్ ఇవ్వలేదన్నారు. విశాఖ డెయిరీని సహకార రంగంలోకి తీసుకురావాలని, హౌస్ కమిటీ విచారణ వేగవంతం చేసి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ప్రోత్సాహక ధర లీటరుకు రూ.5 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 2వ వారంలో విశాఖ డెయిరీ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తీర్మానించారు. సమావేశంలో పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, జిల్లా నాయకులు టి. పైడి నాయుడు, మాజీ సర్పంచ్ గంగు నాయుడు, వసంత సర్పంచ్ సిరికి సత్య నారాయణ, బుడతనాపల్లి విశాఖ పాల సంఘం అధ్యక్షుడు చుక్క అప్పారావు, రాజు, వసంత ఎంపిటిసి మీసాల వెంకటప్పలనాయుడు, చొక్కాకు సత్యారావు,గొడ్డి రమేష్, అల్తి బుచ్చిం నాయుడు, చలుమూరి అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చెయ్యొద్దు

ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఆర్.ఆమదాలవలస కాలనీ పాఠశాల రెండు కిలోమీటర్లు దూరం ఉన్న ఆమదాలవలస పంచాయతీ పాఠశాలలో విలీనం చేయొద్దని, అలా చేస్తే ఊరుకునేది లేదని విద్యార్థులు తల్లిదండ్రులు, పంచాయతీ పాలకవర్గం హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్ బెవర రాంబాబు, వెంకటరమణ, మూర్తి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆర్ ఆమదాలవలస పాఠశాల 28 సంవత్సరాల నుంచి నడుస్తుందన్నారు. ఈ ప్రాథమిక పాఠశాలలో ఆర్. ఆమదాలవలసతో పాటు ఉంగరాడమెట్ట, ఇతర గ్రామాల నుంచి 40 నుంచి 50 వరకు విద్యార్థులు అభ్యసిస్తున్నారని వెల్లడించారు. ఈ పాఠశాలను రెండు కిలోమీటర్లు దూరం ఉన్న ఆమదాలవలస గ్రామానికి తరలిస్తామన్న ఆలోచన విరమించాలని విద్యాశాఖ అధికారుల వద్ద వాపోయారు. నిత్యం ఇసుక ట్రాక్టర్లు, చెరుకు ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో రద్దీగా ఉండే రోడ్లపై చిన్నారులు పాఠశాలకు వెళ్తే జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. దీనిపై ఎంఇఒ ఎం వరప్రసాదరావు స్పందించి మాట్లాడుతూ 117 జిఒ ప్రకారం గత ప్రభుత్వం అమలు చేసిందని, ఈ ప్రభుత్వంలో ఇంతవరకు ఎటువంటి జీవోలు రాలేదని బదులిచ్చారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు ఆదేశాలు పాటిస్తున్నట్లు వెల్లడించారు.


ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు

హోటళ్లకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్

ప్రజాశక్తి-విజయనగరం

పర్యావరణ హితంగా, పర్యాటకులను ఆకర్షించేలా నడిపే హోటళ్లకు ప్రభుత్వం గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇస్తుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అందుకోసం ఘన వ్యర్థాల నిర్వహణ, మానవ వ్యర్థాల నిర్వహణ , మురుగు నీటి నిర్వహణల ఆధారంగా మూడు విధాలుగా మార్కులు కేటాయిస్తామని తెలిపారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో హోటల్ యజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో, డివిజన్ స్థాయిలో సబ్ కమిటీలు హోటల్స్‌ను తనిఖీ చేసి రేటింగ్ కోసం సిఫార్సు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఈ రేటింగ్‌ను హోటళ్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చునని, అందువలన ఆయా హోటళ్ళ ర్యాంకింగ్ బుక్ చేసుకునే వారికీ తెలుస్తుందని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకింగ్ ఉన్న హొటల్స్ ను ప్రభుత్వమే వెబ్సైటులో పెట్టి ప్రోత్సహిస్తుందన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా హోటళ్లు ఉంటే వారి వాణిజ్య ప్రయోజనాలు మెరుగుపడతాయని అన్నారు. హోటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, పచ్చదనాన్ని పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ నెలాఖరు లోపు మరోసారి హోటళ్ల యజమానులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, తర్వాత కమిటీ ల సందర్శన అనంతరం ర్యాంకింగ్ ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి కుమార స్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, డిపిఒ వెంకటేశ్వర రావు, పలు హోటళ్ళ యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు రూ.26 వేలు వేతనమివ్వాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ


మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్‌పిఆర్ భవన్‌లో విజయనగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ యూనియన్ కార్యదర్శి విశాలాక్షి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బరావమ్మ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని కార్పోరేట్లకు తాకట్టు పెట్టిందని, అందులో భాగమే 4 లేబర్ కోడ్‌లను ఏప్రిల్ 1 నుంచి అమల్లో కి తెస్తున్నారని మండి పడ్డారు. కోటి మందికి పైగా ఉన్న స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించటానికి కూడా మోడీ అంగీకరించటం లేదని, 8 గంటల పని దినాన్ని 12 గంటలగా మార్పు చేస్తున్నారని అన్నారు. కనీస వేతనాలు, గ్రాట్యూటీ వంటి చట్ట భద్ధమైన హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్ల ను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల అనే పదాన్ని తొలగించి సంక్షేమ పథకాల అమలు చేయాలని, సర్వీస్ లో చనిపోయిన వారికి మట్టి ఖర్చులు రూ.20వేలతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, డిఎ బిల్లులు తక్షణమే ఇవ్వాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సర్ఫర్ చేయాలి వేతనంతో కూడిన మెడికల్ లీవులు కనీసం మూడు నెలలు ఇవ్వాలని, ప్రీస్కూల్ పిల్లల తల్లులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఫిబ్రవరి 28న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు తగినంత కేటాయింపులు చేయాలని, అంగన్వాడీల వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్రావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడ్రాజు, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు మంగవేణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-వేపాడ

రోడ్డు విస్తరణ ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామని ఆర్‌డిఒ డి.కీర్తి తెలిపారు. రోడ్డు విస్తరణలో మండలంలోని బొద్దాం, పాటూరు గ్రామాల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారితో సోమవారం ఆర్‌డిఒ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆమె బాధితులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. రెండు గ్రామాల్లో బాధితుల జాబితాను పంచాయతీ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారని చెప్పారు. ఏమైనా సందేహాలున్నా, జాబితాల్లో పేర్లు లేకున్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిని కూడా పరిశీలించి, నష్టపరిహారం అందిస్తామని, ఎవరూ నిరాశ పడవద్దని చెప్పారు. బొద్దాం గ్రామంలో 130 మంది బాధితులకు రూ.12.13 కోట్లు మంజూరైందన్నారు. పాటూరు గ్రామంలో 30 మందికి ఇంకా మంజూరు కాదని, త్వరలో పరిహారం వస్తుందని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ జె.రాములమ్మ, గ్రామ సర్పంచులు ఎర్ర రామలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, ఉప సర్పంచ్ కె.రమణమూర్తి, ఆర్‌డిఒ కార్యాలయ డిటి పి.కిరణ్, డిటి సన్యాసినాయుడు, ఎంఆర్ఐ రామలక్ష్మి, సర్వేయర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కీర్తి

ఉపాధి పనులు కాంట్రాక్టర్లకు ఇవ్వొద్దు

విజయనగరం టౌన్ : ఉపాధి హామీ పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యాన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తికి సోమవారం వినతి అందజేశారు. ఉపాధి హామీ పనులు కాంట్రాక్టర్లకు ఇచ్చి పేదలు డబ్బులు కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం అన్యాయమన్నారు. పేదలు కోసం పెట్టిన పథకం కాంట్రాక్టర్లకు ఇవ్వాలని నిర్ణయం చేయడమంటే ఈ ప్రభుత్వం ఎవరి పక్షాన ఉందో అర్థం అవుతుందన్నారు. తక్షణమే హై కోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ పంచాయతీ రాజ్ అధ్యక్షులు సారికి వైకుంఠం, విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు, ఎల్.కోట ఎంపిపి గేదల శ్రీనివాసరావు, చల్లా చలంనాయుడు, జెడ్‌పిటిసిలు గార తౌడు, వర్రి నరసింహమూర్తి, పతివాడ అప్పలనాయుడు, జైహింద్ కుమార్,రత్నాకర్, పొట్నూరు సన్యాసి నాయుడు, తాడ్డి వేణుగోపాల్ నాయుడు, బెల్లాన త్రినాథ్, విశ్వేశ్వర రావు, పెద్దఎత్తున సర్పంచ్ లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అపరాలకు మద్దతుధర ఇవ్వాలని నిరసన

విజయనగరం టౌన్ : జిల్లాలో పెసలు, మినుములకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర ఇవ్వాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు మాట్లాడుతూ పెసలు క్వింటా రూ.8682, మినుములు రూ.7400 మద్దతుధర ఉంటే, ప్రయివేటు వ్యాపారులు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే తుపాను వల్ల చాలావరకు రైతులు పంట నష్టం పోయారన్నారు. ఇప్పుడు మద్దతుధర రాక నష్టపోతున్నారని, మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా

విజయనగరం టౌన్ : ఈనెల 11 నుంచి రెండు రోజులు పాటు విశాఖలోజరిగిన డిఆర్ ఎం కప్ 8వ రాష్ట్రస్థాయి ఉమెన్స్ సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మూడు రజిత, మూడు కాంస్య పతకాలు గెలుపొందారు. ఎస్. షర్మిల 70 కిలోల కేటగిరిలో రజిత పతకం, మనోజ్ (75 కిలోలు), సుమిత్ర (80కిలోలు) రజిత పతకాలు, ఎన్.రమ్య (57 కిలోలు), బి.పూజిత (65 కిలోలు), వై.అనూష కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మిగజపతిరాజు అభినందించారు. త్వరలో రాష్ట్రస్థాయి పోటీలు విజయనగరం అసోసియేషన్ ద్వారా నిర్వహిస్తున్నారు.

స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా

- కట్టుదిట్టంగా లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం అమలు
- జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో వ్యత్యాసం అధికంగా ఉంటుందని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిని తగ్గించేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసి, స్కానింగ్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. సోమవారం కలెక్టరేట్‌లో గర్భస్థ శిశు లింగ నిర్ధారక పరీక్షల నిరోధక చట్టం జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 110 స్కానింగ్ కేంద్రాల ద్వారా రోజువారీ చేపడుతున్న స్కానింగ్‌ల సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులకు అవసరం ఉన్నా, లేకపోయినా సిజేరియన్ చికిత్సలకు డాక్టర్లు సిఫారసు చేస్తూ పేద కుటుంబాలపై అనవసర ఆర్థిక భారం మోపుతున్నారని, దీనిని నివారించే దిశగా చర్యలు చేపట్టాలని చెప్పారు. జిల్లా స్థాయిలో స్కానింగ్ కేంద్రాల తనిఖీ విషయంలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డిఒలు కూడా స్కానింగ్ కేంద్రాలు తనిఖీ చేయాలని చెప్పారు. జిల్లాలోని 115 కేంద్రాలకు గాను ఇప్పటివరకు 47 కేంద్రాల తనిఖీ పూర్తయినట్టు వైద్య ఆరోగ్య అధికారులు వివరించారు. మొక్కుబడిగా స్కానింగ్ కేంద్రాల తనిఖీ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, తనిఖీల ద్వారా ఫలితాలు కనిపించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జీవనరాణి, టిబి నియంత్రణ అధికారి రాణి, ప్రోగ్రాం అధికారి డా.బాలసుబ్రహ్మణ్యం, సిఐ నరసింహమూర్తి, జిల్లా మాస్ మీడియా అధికారి చిన్నతల్లి, ఆర్‌డిఒ కార్యాలయ ఏ.ఓ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పత్రాల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ పత్రాల తనిఖీ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చేపట్టారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.ఆర్.అంబేద్కర్ సోమవారం సాయంత్రం ఈ తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తనిఖీ ప్రక్రియ నిర్వహణకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు పాల్గొన్నారు.


బ్యాలెట్ పత్రాల తనిఖీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ పిఒ ఎ.రామారావు

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి- డెంకాడ

వచ్చే నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర సర్వ శిక్ష జిల్లా అధికారి డాక్టర్ ఎ.రామారావు కోరారు. మండలంలోని మోపాడ కెజిబివి పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగదిని భోజనాలను వంట సామగ్రిని పాఠశాల పరిసరాలను విద్యార్థులకు కేటాయించిన గదులను, మరుగుదొడ్లను క్షుణంగా పరిశీలించారు. పాఠశాల రికార్డులన్నింటినీ తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థినిలు ఉపాధ్యాయులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. పదో తరగతి పరీక్షలో విద్యార్థుల్లో చైతన్యం నింపి శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పిల్లలను ఒత్తిళ్లకు గురి చేయకుండా ఆలోచన శక్తి పెంచే విధంగా వారిలో ఉండే సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. ఆహ్లాదకరమైన సమాజాన్ని నిర్మించే విధంగా వారిని తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.భవాని, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజుమృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్




విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ 34వ డివిజన్ కార్పొరేటర్, వైసిపి నాయకురాలు బాలి పైడిరాజు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆమె మృతికి మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. విటి అగ్రహారం, తోటపాలెం, ధర్మపురి, దాసన్నపేట, బుచ్చన్నకోనేరు సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్నందున వాటి పరిధిలోని తోటపాలెం , శ్రీరామ్ నగర్, గోపాల్ నగర్, ఇందిరా నగర్, నాగోజీపేట , రైల్వే స్టేషన్ రోడ్, బాలాజీ నగర్, సాయి నగర్, నరసింహ నగర్, సిద్దార్ధ నగర్, ధర్మపురి , దాసన్నపేట, ఫోర్ట్ ఏరియాలకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-లక్కవరపుకోట

వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అందజేశారు. లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఐదుగురికి రూ.7,31,222 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోతంపేట సర్పంచ్ కొరుప్రోలు, ముత్యాల నాయుడు, టిడిపి ఎస్.కోట మండల అధ్యక్షుడు ఇఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిఎం ఉమామహేశ్వరరావు, ఎపిఎం (ఎఫ్‌పిఒ) వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ స్టాల్ ఏర్పాటు చేశారు. మండలంలో దెందేరు, గనిశెట్టిపాలెం, చీడివలస, గొల్లలపాలెం, తుమికాపల్లి, దేవాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలను ఇక్కడ ప్రదర్శించారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అధికారులకు, ప్రజలకు వీటిని విక్రయిస్తారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రావ్య, లక్ష్మి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి

ప్రజాశక్తి-కొత్తవలస

శారద స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఆ కంపెనీ హెచ్ఆర్ డిజిఎం సన్యాసిరావు, కంటకాపల్లి సర్పంచ్ మదిన అప్పలరాం తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన 54 మంది మహిళలకు సోమవారం ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ ఆర్ అసిస్టెంట్ మేనేజర్ శంకర్రావు, హెచ్ఆర్ ఆఫీసర్ సంతోష్ కుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఓబులయ్యపాలెం, ముకుందపురం పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించి, సంతృప్తి వ్యక్తంచేశారు.



అన్నదానం చేస్తున్న ఎంపిటిసి గొంప తులసి

ఎం.సింగవరంలో అన్నదానం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది పంచాయతీ పరిధిలోని ఎం.సింగవరం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. తొలుత వీరాంజనేయస్వామి ఆలయంలో వెంకటరావు దంపతులు పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలతోపాటు పాల్గొన్న ప్రతి ఎడ్లబండి యజమానికీ నగదు బహుమతులను వెంకటరావు దంపతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కోటిని కృష్ణ, పాల కేంద్రం అధ్యక్షులు కె.అప్పలనాయుడు, అడ్వకేట్ గుమ్మడి రవిశంకర్, గొర్లె నాగరాజు, పల్లి ధనుంజయ్, డేగల ఈశ్వరరావు, మైచర్ల అప్పన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి- రాజాం



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరసన తెలిపారు. సమ్మె కాలపు ఒప్పందం అమలు చేయాలని ఐసిడిఎస్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ గోపి చందుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకి వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం 42 రోజులు పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామని సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జులైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ ఇచ్చారని, అయినా నేటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, సాధికారిక సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కరణ ఖర్చులకు రూ.20వేలు ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ రూపవతి, పార్వతీ, భారతి, కుమారి, వనజాక్షి, జయలక్ష్మి, సునీత, లక్ష్మీ, సుజాత, నిర్మల, పైడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె కాలపు ఒప్పందం అమలు చేయాలి

శృంగవరపుకోట : అంగన్వాడీల సమ్మె కాలపు ఒప్పందం అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం సిడిపిఒ ఉమకు వినతిపత్రం అందించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని కోరారు. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు నాయకులు డి.శ్యామల, జయలక్ష్మి, నాగజ్యోతి, ఉమ, గంగా, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి- భోగాపురం



ప్రమాదాల స్పాట్‌లను పరిశీలిస్తున్న ఎస్‌పి

జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. సోమవారం జాతీయ రహదారి 16పై ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను స్వయంగా ఆయన పరిశీలించారు. నేషనల్ హైవే అథారిటీ, ఆర్‌టిఎ, పోలీసు అధికారులతో కలసి సంయుక్త తనిఖీలు చేపట్టారు. మహారాజుపేట నుండి టోల్ గేట్ వరకు రహదారి ప్రమాదాలకు కారణాలు గుర్తించిన ఎస్‌పి ప్రమాదాల నియంత్రణకు సెంట్రల్ డివైడర్స్, లైటింగ్, జిగ్ జాగ్, సర్వీసు రోడ్లపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చెయ్యాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలాలు, బ్లాక్ స్పాట్స్ వద్ద డ్రోన్స్‌తో ప్రమాద కారణాలను అన్వేషించారు. మహారాజుపేట, లింగాలవలస, పోలిపల్లి, అవనాం, నారుపేట, భూమాత లే అవుట్, ఉప్పాడపేట, రావివలస, నారుపేట, సవరవిల్లి నందిగాం, భోగాపురం, సుందరపేట వద్ద సుమారు 17 కిలోమీటర్లు విస్తీర్ణంలో గల బ్లాక్ స్పాట్స్‌ను సందర్శించి, డ్రోన్స్‌తో ఆయా ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ లోపాలను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల వద్ద పాదచారులు రహదారి దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని, ఆయా ప్రాంతాల్లో సెంటర్ డివైడర్ పై రైలింగ్ వేయాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినపుడు వాహనాల నంబర్లను గుర్తించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భోగాపురం పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బిడబ్ల్యు సిఐ ఆర్.వి.ఆర్‌కె చౌదరి, భోగాపురం సిఐ ఎన్.వి.ప్రభాకరరావు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఎన్‌హెచ్ఎ ప్రాజెక్ట్ అధికారి మెవాడ్ లాల్, డబ్ల్యు మేనేజర్ రామస్వామి, ఆర్‌టిఎ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటరావు, భోగాపురం ఎస్‌ఐలు పి.పాపారావు, సూర్యకుమారి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రషర్ కాలుష్యంతో ప్రాణాలకు ముప్పు

క్రషర్‌ను నిలిపేయాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - జామి



వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు రమణ, అప్పారావు

స్టోన్‌క్రషర్ వెదజల్లే దుమ్ము, ధూళితో మాధవరాయమెట్ట కాలనీ వాసుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయ సిపిఎం జిల్లా నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి క్రషర్‌ను నిలిపేయాలని సోమవారం స్థానిక తహశీల్దార్ కృష్ణలతను సిపిఎం ఆధ్వర్యాన బాధితులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్న గిరిజనులకు ఒక నాడు ఉపాధి కల్పించే క్రషర్లు, క్వారీలు నేడు ప్రాణాలు హరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆవాసాలకు, రాష్ట్ర రహదారికి 500 మీటర్లు దాటి స్టోన్ క్రషర్ ఉండాలన్న నిబంధనలను పట్టించుకోకుండా తప్పుడు రిపోర్టులతో జిల్లా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకుల అండ చూసుకుని స్టోన్ క్రషర్ యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న క్వారీలు, క్రషర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు లైసెన్సులతో విచ్చలవిడిగా రిగ్ బ్లాస్టింగులు చేస్తూ, కాలనీలో ఇళ్లను పూర్తిగా దెబ్బతీస్తున్నా పోలీసులు మామ్ముళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సావిత్రి, రాము, నారాయణ, అర్జున్, నీలన్న, బంగారమ్మ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో తాగునీరు వృథా చేయకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని బలిజిపేట రోడ్డు, చర్చి సెంటర్, చాకలివీధి, రాజనగర్ కాలనీ, నంబియార్ వేణు మిల్లు వెనుక భాగంలో పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. బలిజిపేట రోడ్డులో కుళాయి నీరు వృథాగా పోవడంతో గమనించి, ట్యాపులు బిగించాలని సూచించారు. తాగునీరు వృథా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పైపులైన్ లీకులను నివారించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరించాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఆమెతో మున్సిపల్ శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

ఎంజెపిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లాలో మహాత్మా జ్యోతి భాపూలే బిసి బాలికల పాఠశాలలో(ఎంజెపి) ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని నెల్లిమర్ల ఎంజెపి విద్యాలయం ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కె.బి.బి. రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంజెపి విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నెల్లిమర్ల 80, గంట్యాడ 80, కొత్తవలస 80, నెల్లిమర్ల బాలురు (మత్స్యకార) 80, గజపతినగరం బాలురు 80, విజయనగరం బాలురు 40, సీట్లు ఖాళీలున్నాయన్నారు. 6,9 తరగతులు మిగులు సీట్లకు బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన వారు దరఖాస్తులు వచ్చేనెల 15లోగా చేసుకోవాలన్నారు. నెల్లిమర్ల ఎంజెపి బిసి బాలికల కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి ఎంపిసి 60, బైపిసి 60, సిఇసి 40, ఎంఇసి 40సీట్లకు వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యం నాయుడు

పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలో నెలివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను డిఇఒ యు.మాణిక్యం నాయుడు సోమవారం అకస్మాత్తుగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై సమీక్షించి, పిల్లలు ఎలా చదవాలి, పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలి.. అనే విషయాలపై అవగాహన కల్పించారు. సి, డి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, క్రమం తప్పకుండా వారి ప్రగతిని పరిశీలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంద శాతం ఫలితాలు సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శారద, తదితరులు పాల్గొన్నారు.

బిఎన్‌ఆర్ ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో మాధవలస గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, రాష్ట్ర నాగవంశపు మాజీ డైరెక్టర్ బోని అప్పలనాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన జ్ఞాపకార్థం జామి మండలం అట్టాడ గ్రామంలో ఉన్న మాతృభూమి సేవా సంఘం, ఎన్నింటి కృష్ణ దంపతులు బిఎన్‌ఆర్ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలి

పల్లెనిద్రలో సిఐ జెఎవి రమణ

ప్రజాశక్తి- గజపతినగరం



పురిటిపెంట గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ జెఎవి రమణ

పల్లె నిద్రలో భాగంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జెఎవి రమణ సోమవారం రాత్రి పురిటిపెంట గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామ ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విక్రయదారులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎవరైనా నిర్భయంగా తమ వినతులు చెప్పేందుకు వస్తే స్వీకరిస్తామని తెలిపారు. రాత్రికి స్థానిక సచివాలయంలో రాత్రి బస చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పల్లెనిద్ర దోహదం

డెంకాడ : నేరాల నియంత్రణకు పల్లెనిద్ర ఉపయోగపడుతుందని భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పెద్దతాడివాడ పంచాయతీలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు అమలు, నేరాలపు అదుపు చేయడానికి పల్లెనిద్ర ఉపయోగపడుతుందన్నారు. నిరంతర నిఘాలో భాగంగా భద్రత పెంచడానికి గ్రామస్తులు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చట్టపరంగా తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యను తీర్చడానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో తిరిగినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సిఐతోపాటు ఎస్ఐ ఏ సన్యాసినాయుడు పల్లెనిద్రలో పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్నులు వసూలు చేయాలని కమిషనర్ కె.అప్పలరాజు సూచించారు. సోమవారం ఆయన ఆయా సచివాలయం పరిధిలో పన్ను వసూలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున నగర పంచాయతీ పరిధిలో గృహ యజమానులు, వ్యాపారులు, ఇతర సంస్థలు చెల్లించాల్సిన ఆస్తిపన్ను, కొళాయి పన్ను, ఖాళీ స్థలం పన్నులు, డిఒ ట్రేడులు, ఆక్రమణ, ప్రకటన పన్నులు వసూలు పూర్తి చేయాలన్నారు. వార్డుల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేసి నీటి పన్ను అధిక మొత్తంలో బకాయిపడిన వారి కొళాయి డిస్ కనెక్షన్ చేయాలని ఆదేశించారు.

పూల్‌బాగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డు నిర్మాణానికి బుడా నిధులతో ప్రతిపాదనలు పంపించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయ జంక్షన్ వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు, కాలువల నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ప్రకటించారు. నిధులు ఎటూ చాలకపోవడంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకు 650 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.03 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయ జంక్షన్ వరకు 2.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3 కోట్ల వరకు అవసరం కావడంతో విడతల వారీగా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సహకారంతో రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు.

రోడ్డు ఆక్రమణలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించకపోతే కఠిన చర్యలు చేపడతామని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు హెచ్చరించారు. సోమవారం బైపాస్ జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా బొబ్బిలి రోడ్డు వరకు ఉన్న ఆక్రమణలను ఎస్ఐ ప్రసాదరావుతో కలిసి పరిశీలించారు. ఫుట్‌పాత్ లేకుండా అందరూ ఆక్రమించడంతో రోడ్డు ఇరుకుగా తయారైందని, దీంతో ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నారని సిఐ తెలిపారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడారు. రోడ్డు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. లేకుంటే నోటీసులు జారీ చేసే తామే తొలగిస్తామని స్పష్టంచేశారు. దీనిపై ఆర్అండ్‌బి, రెవెన్యూ, గ్రామ పంచాయతీల సహకారంతో సమావేశం ఏర్పాటు చేసి, రహదారి భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

రైల్వే వంతెన పనులు పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

పెంట రైల్వే వంతెన పనులను రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ సోమవారం పరిశీలించారు. రైల్వే మూడో లైన్ వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసినందుకు పిడబ్ల్యుఐ కుమార్ కౌశల్, ఎస్‌పిడబ్ల్యుఐ జి.కిరణ్ కుమార్‌ను జిఎం అభినందించారు. వారికి అవార్డు ప్రదానం చేశారు. రైల్వే మూడో లైన్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిఎం చెప్పారు

సెంచూరియన్‌తో ఎంఆర్ కళాశాల ఎంఒయు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం, మహారాజ కళాశాల (అటానమస్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సోమవారం ఎంఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి మధ్య నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యా ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, విజ్ఞాన మార్పిడి, నైపుణ్యం మార్పిడి వంటి అవకాశాలకు ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీ డయాల్, డీన్ డాక్టర్ విజయ్ బాబు, ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ ప్రొఫెసర్ అనీల్ కుమార్, డీన్ డాక్టర్ పుష్పలత, డాక్టర్ పి.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - వంగర

ఇంటి పరిసరాలలో ఆకు కూరలు, కాయగూరలు వేసుకుని వాటిని వినియోగించుకుంటే ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్నెపల్లి సింహాద్రినాయుడు అన్నారు. ఈ మేరకు మహిళా సమాఖ్య సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంయుక్తంగా మండలంలోని శ్రీహరిపురం కింజంగి గ్రామాలలో మహిళా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సింహాద్రి నాయుడు మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడటం వల్ల వచ్చే అనర్థాలు గూర్చి తెలిపారు. ఇంటి వద్ద ఉన్న తడి చెత్త పొడి చెత్తతో హోమ్ కంపోస్టింగ్ పద్ధతిలో ఎరువులు తయారు చేసుకునే విధానం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వెలుగు సిబ్బంది విమల, లక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

కంటి సమస్య ఉన్న విద్యార్థులకు వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ సోమవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. 37 విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ అంబేద్కర్ గురుకుల ప్రిన్సిపల్ టి.జయశ్రీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. సాంబశివరావు, ఇఒ నరసింహారావు, హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, స్టాఫ్ నర్స్ దీప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - విజయనగరం కోట

విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి బలగం రమణ, వైసిపి నాయకులు బలగం సత్తిబాబు ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గెడ్డపాము సుందరరావు, వార్డు సభ్యులు కునుకుశ్రీను, బలగం పెంటంనాయుడు తదితరులు సోమవారం టిడిపిలో చేరారు. టిడిపి విజయనగరం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి రాజేష్ బాబు, పట్టణ నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, టిడిపి నాయకులు వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖ-అరకు రహదారిలో పట్టణంలోని పుణ్యగిరి ప్రయివేట్ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తూరు గ్రామానికి చెందిన బాడిత బోయిన దుర్గాప్రసాద్ (17) మృతిచెందాడు. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం.. దుర్గాప్రసాద్ చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. దీంతో తల్లి గంగ పిల్లలను తీసుకుని, కొత్తూరులోని పుట్టింటి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారుంటున్న ఇంటికి కరెంటు సామగ్రి తీసుకొచ్చేందుకు తెలిసిన వారి బైకు తీసుకుని దుర్గాప్రసాద్ ఎస్.కోటకు బయల్దేరాడు. పుణ్యగిరి డిగ్రీ కళాశాల వద్ద వేరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక ద్విచక్ర వాహనదారుడు రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దుర్గాప్రసాద్ మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సిఐ జె.జనార్దనరావు ఆధ్వర్యంలో చేపట్టగా పాతబగ్గాంలో 9 మద్యం సీసాలతో సంగంరెడ్డి శ్రీను పట్టుబడ్డాడు. విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ కె.ఇందిరాదేవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా కెంగువలో 11 మద్యం సీసాలతో బొంతు పైడిరాజు పట్టుబడ్డాడు. వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు సిఐ జనార్దనరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు పి.నరేంద్ర కుమార్, ఎన్.కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.